ప్రజాశక్తి

మంగళవారం 7 మార్చి 2023

పార్వతీపురం మన్యం

అపోహలు వీడాలి : సబ్ కలెక్టర్

ప్రజాశక్తి - వీరఘట్టం

భూ రీ సర్వేలో భాగంగా రైతులు అపోహలు విడనాడాలని పాలకొండ సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ రైతులకు సూచించారు. సోమవారం మండలం చలివేంద్ర పంచాయతీ పరిధి జే గోపాలపురంలో రైతు సదస్సు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. భూ హక్కులకు సంబంధించి ఎటువంటి సమస్య ఉన్న తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు చొరవ చూపుతామన్నారు. గ్రామాల్లో సభలు నిర్వహించినప్పుడు రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎటువంటి లోపాలు ఉన్నా ఇప్పుడే పరిష్కారం చేసుకోవాలని రైతులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహాశీల్దార్ సిహెచ్ సత్యనారాయణ, విఆర్ఒలు, రైతులు పాల్గొన్నారు.



గుంకలాంలోని జగనన్న లే అవుట్

పంచపాండవులెంతమంది అంటే మంచం కోళ్ల మాదిరిగా మూడేనంటూ రెండు చూపుడు వేళ్లు చూపించినట్టుగా ఉంది మన జిల్లాలో గృహ నిర్మాణం లెక్క తీరు. ఆర్థిక ఇబ్బందులు, ఇసుక కొరత, పెరిగిన నిర్మాణ సామంగ్రి ధరల నేపథ్యంలో నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. వ్యక్తిగత స్థలాల్లో మినహా చాలా వరకు జగనన్న లేఅవుట్లు పునాదులు, మొండిగోడలతో వెక్కిరిస్తున్నాయి. సగానికిపైగా నిర్మాణ పనుల ప్రారంభానికి నోచుకోలేదంటే అతిశయోక్తి కాదు.

నత్తనడకన గృహ నిర్మాణం

- ప్రారంభానికి నోచుకోని 30 వేల ఇళ్లు
- పునాదుల స్థాయిలో నిలిచిన 15 వేల ఇళ్లు
- పూర్తయినవి మూడో వంతే
- గుంకలాం లేఅవుట్లో మరీ అధ్వానం
- ఉగాది నాటికి గృహ ప్రవేశాలు అనుమానమే

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లా వ్యాప్తంగా 77,205 ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందులో 34 వేల వరకు జగన్న లేఅవుట్లలోనివే. మిగిలిన ఇళ్ల లబ్ధిదారులు తమ సొంత స్థలాల్లో నిర్మాణాలు చేపట్టారు. మంజూరైన మొత్తం ఇళ్లలో 25,404 వరకూ నిర్మాణాలు పూర్తి అయినట్టు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. అంటే మూడో వంతు మాత్రమే నిర్మాణాలు జరిగినట్టు లెక్క. వీటిలోనూ సొంత స్థలాల్లో నిర్మించుకున్నవే ఎక్కువగా ఉన్నాయి. జగనన్న లేఅవుట్లలో నిర్మాణాలు తక్కువగా ఉన్నాయి. దాదాపు 30వేల స్థలాల్లో నిర్మాణాలు చేపట్టలేదు. 14,959 మంది పునాదుల స్థాయిలో నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో ఉగాదినాటికి ఇళ్లు పూర్తిచేయడం, సామూహిక గృహ నిర్మాణాలు అనుమానంగానే ఉన్నాయి. దీన్ని కప్పిపుచ్చు కునేందుకు ప్రభుత్వం ఉగాది లక్ష్యం కొంతేనంటూ కొత్తపల్లవి అందుకుంటోంది. ఆ లెక్కలను కాస్త పరిశీలిస్తే 34,500 ఇళ్లను మాత్రమే లక్ష్యం పెట్టుకున్నామని చెబుతోంది. అందులో 25వేల వరకు పూర్తయినట్టు చెబుతున్నా వీటిలో సొంత స్థలాల్లో కాస్త ఆర్థికంగా అవకాశమున్నవారే ఎక్కువగా కనిపిస్తున్నారు. జగనన్న లేఅవుట్లలో నిర్మాణాలు పెద్దగా జరగడం లేదనడానికి రాష్ట్రంలోనే అతిపెద్ద లేఅవుట్‌గా చెప్పుకుంటున్న గుంకలాం లేఅవుట్‌లో నిర్మాణాలు మచ్చుతునకగా చెప్పుకోవచ్చు. ఈ లేఅవుట్‌కు అవసరమైన సుమారు రూ.90 కోట్లతో 394.04ఎకరాలు కొనుగోలు చేసిన విషయం విధితమే. రోడ్లు, విద్యుత్, నీరు, వీటికి అవసమైన సిమెంటు గొడౌన్లు, విశ్రాంతి షెడ్లు తదితర కోసం రూ.కోట్లు ఖర్చుచేశారు. అయినా నిర్మాణాలు అంతంత మాత్రమే జరిగియి. 2020 డిసెంబర్ 31న సాక్షాత్తు సిఎం జగన్మోహన్‌రెడ్డి పట్టాలు జారీచేసిన ఈ లేఅవుట్లో 12,216 ప్లాట్లు పంపిణీ చేయగా, వీటిలో 10,112మంది లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేశారు. ఇస్తున్న రూ.1.80లక్షలు ఏమూలకూ సరిపోయే పరిస్థితి లేకపోవడంతో కేవలం 2,132మంది మాత్రమే సొంతంగా ఇళ్లు నిర్మించుకునేందుకు ముందుకు వచ్చారు. మిగిలిన వారంతా ఆర్థిక ఇబ్బందులతో చేతులెత్తేశారు. దీంతో, 3వ ప్రత్యామ్నాయం పేరిట మిగిలిన వారందరికీ సొంతంగా ఇళ్లు నిర్మిస్తామంటూ బలవంతంగా బ్యాంకు అకౌంట్లు ఓపెన్‌చేయించి మరీ రంగంలో దింపారు. కానీ, ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించక పోవడంతో ఆయా నిర్మాణాలన్నీ పునాదులతోనే ఆగిపోయాయి. ప్రభుత్వం తరపున తలపెట్టిన 7980 ఇళ్లలో 4,500 ఇళ్లకు మాత్రమే పునాదులు పడ్డాయి. వీటిలో 12ఇళ్లకు మధ్యస్తంగా గోడలు నిర్మించారు. ఒక్కటంటే ఒక్కటి కూడా పూర్తికాలేదు. మిగిలినవి పునాదులకు కూడా నోచుకోలేదు. ఇక సొంతంగా నిర్మించుకున్న 2132 ఇళ్లలో 1680 ఇళ్లు పునాదాలు స్థాయిలోనే నిలిచిపోయాయి. 106 వరకు మొండిగోడలతో వెక్కిరిస్తున్నాయి. ఇప్పటి వరకు నిర్మాణం పూర్తయినవి కేవలం 138 మాత్రమే. మరో 78 స్లాబ్ వరకు వచ్చాయి. వీటికి కూడా విద్యుత్ కనెక్షన్లు ఇవ్వలేదు. రాష్ట్ర స్థాయిలో అతిపెద్ద లేఅవుట్‌గా చెప్పుకుంటూ సాక్షాత్తు సిఎం పట్టాలు పంపిణీ చేసిన చోటే ఇలా ఉంటే మిగిలిన చోట్ల పరిస్థితి ఎలా ఉంటుందో వేరేగా చెప్పనక్కర్లేదు.

జిల్లా సమగ్రాభివృద్ధికి పాటుపడతా

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ

పాలకొండలో ప్రచారం చేస్తున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ

ప్రజాశక్తి - కలెక్టరేట్, పాలకొండ

విద్యార్థులు, యువకులు, ఉద్యోగులు, ఉపాధ్యాయ, పెన్షనర్ల, మధ్యతరగతి వర్గాల ప్రజల సమస్యలు పరిష్కరించడంతో పాటు జిల్లా సమగ్రాభివృద్ధికి శక్తి వంచన లేకుండా పాటుపడతానని ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ అన్నారు. సోమవారం ఆమె పార్వతీపురం మన్యం జిల్లాలోని పార్వతీపురం, పాలకొండ, విజయనగరం జిల్లా మెరకముడిదాం మండలాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్వతీపురం సుందరయ్య భవనంలోను, పాలకొండలోను ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉత్తరాంధ్ర సమగ్ర అభివృద్ధికి, ప్రభుత్వ రంగ పరిరక్షణకు, సిపిఎస్ రద్దు, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్స్‌తో పాటు గిరిజన ప్రాంతంలో రద్దు చేసిన జిఒ3 పునరుద్ధరణకు, చట్టబద్ధత కల్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీలు నిస్వార్థంగా, నిజాయితీగా ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజా సమస్యలపై నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. నేడు చట్టసభల్లో అన్ని తరగతుల ప్రజల సమస్యలు చర్చకు తీసుకొస్తున్నది కేవలం పిడిఎఫ్ ఎమ్మెల్సీలేనని అన్నారు. ప్రభుత్వ రంగం బలోపేతం, సిపిఎస్ రద్దు, ఒపిఎస్ పునరుద్ధరణ, సిఆర్‌టి, గెస్ట్ ఫ్యాకల్టీ, పార్ట్ టైం వంటి ఉద్యోగ, అధ్యాపకుల సమస్యలు, ఉపాధి కల్పన, కనీస వేతనం, నిరుద్యోగ భృతి, ప్రభుత్వ సంస్థల ఖాళీల భర్తీ, కార్మిక చట్టాల సవరణ వంటి అనేక అంశాలపై ప్రజల తరపున నిజాయితీగా పనిచేస్తున్నది పిడిఎఫ్ ఎమ్మెల్సీలేనని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలపై ఒత్తిడి తేవడమే ప్రధాన ఎజెండాగా పనిచేస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర విభజన తర్వాత కూడా ఉత్తరాంధ్ర అభివృద్ధి సాధించలేదు సరి కదా మరింత వెనుకబాటులోనికి నెట్టబడిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర విభజన చట్టాన్ని అపహాస్యం పాలు చేస్తుందని విమర్శించారు. రైల్వే జోన్ నేటికీ ఇవ్వలేదు కానీ వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన విశాఖ రైల్వే డివిజన్‌ను ఎత్తివేయాలని నిర్ణయించిందని అన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం అనేక అభివద్ధి సంస్థలను కలుపుకొని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ఆధ్వర్యాన శక్తి మేరకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఈ ప్రాంతం నుంచి గెలిచిన ప్రజా ప్రతినిధికి ఈ ప్రాంత అభివద్ధి పట్ల చిత్తశుద్ధి లేదన్నారు. ఈ నేపథ్యంలో మన ప్రాంత ప్రజల వాణి చట్టసభల్లో వినిపించడానికి ఉన్నత విద్యావంతురాలిగా 250లకు పైగా ప్రజా సంఘాలు, సామాజిక సంస్థలు బలపరుస్తున్న తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో ప్రజాసంఘాల నాయకులు జి.వెంకటరమణ, వి.ఇందిర, పి.రాజశేఖర్, కె.రాజు, సిహెచ్ సింహాచలం, తిరుపతిరావు, దావాల రమణారావు, పి.ప్రభాకర్, హిమప్రభ, దూసి దుర్గారావు, వీరంనాయుడు పాల్గొన్నారు.

వీరఘట్టం మండలంలోని పలు విద్యాసంస్థల్లో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ ప్రచారం చేశారు.

రమాప్రభకు మద్దతుగా ప్రచారం

వేపాడ : పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభకు మద్దతుగా మండలంలో ఎపి రైతుసంఘం జిల్లా నాయకులు చల్లా జగన్ ప్రచారం చేశారు. ఉద్యోగులు, నిరుద్యోగులు, విద్యార్థులు, కార్మికులు, ప్రజల సమస్యలపై శాసనమండలిలో గళమెత్తే పిడిఎఫ్ అభ్యర్థి రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసు గెలిపించాలని కోరారు.

కిడ్నీ వ్యాధిగ్రస్తులతో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ ప్రారంభం

- అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలి
- రిక్రూట్‌మెంట్ డైరెక్టర్ కల్నల్ వినయ్‌కుమార్

ప్రజాశక్తి-విజయనగరం

భారత సైనిక దళాల్లో అగ్నివీర్ నియామక ప్రక్రియ ప్రారంభమయ్యిందని, విశాఖపట్నం రిక్రూట్‌మెంట్ సెంటర్ డైరెక్టర్ కల్నల్ వినయ్‌కుమార్ చెప్పారు. ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ ప్రక్రియను వివరించారు. అగ్నివీర్ నియామకాల కోసం ఫిబ్రవరి 16 నుంచి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమయ్యిందని, మార్చి 15వరకు రిజిస్ట్రేషన్లు చేసుకొనే అవకాశం ఉందని తెలిపారు. గత రిక్రూట్‌మెంట్‌లకు భిన్నంగా, అగ్నివీర్ ఎంపిక కోసం ముందుగా ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలని, నిర్ణీత తేదీల్లో నిర్వహించిన ఆన్‌లైన్ టెస్టు తరువాత, దానిలో ఉత్తీర్ణులైన వారికి శారీరక ధారుఢ్య పరీక్ష, వైద్య పరీక్షలను నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రంలో విశాఖపట్నం, రాజమండ్రి, విజయవాడతో సహా దేశంలో మొత్తం 76 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. కంప్యూటర్ ఆధారిత ఆన్‌లైన్ రాత పరీక్ష జరుగుతుందని, ఈ మార్పులను అభ్యర్థులు గమనించాలని సూచించారు.

అభ్యర్థుల వయసు 17 సంవత్సరాల 6 నెలలు నిండి, 21 ఏళ్ల లోపు ఉండాలని, ఆయా పోస్టులను బట్టి పదో తరగతి నుంచి ఇంటర్ ఉత్తీర్ణత, ఇతర సాంకేతిక అర్హతలు ఉండాలని చెప్పారు. అగ్నివీర్ జనరల్ డ్యూటీ, అగ్నివీర్ జనరల్ డ్యూటీ (ఉమెన్ మిలటరీ పోలీస్), అగ్నివీర్ టెక్నికల్, అగ్నివీర్ క్లర్క్, స్టోర్ కీపర్, అగ్నివీర్ ట్రేడ్స్‌మెన్, అగ్నివీర్ ట్రేడ్స్‌మెన్ 8వ తరగతి పాస్ మొదలగు ఆరు రకాల విభాగాల్లో రిక్రూట్‌మెంట్ జరుగుతోందని చెప్పారు. తొలిసారిగా మహిళలకు కూడా ఎంపిక నిర్వహిస్తున్నామన్నారు. పూర్తిగా ప్రతిభ ఆధారంగా రిక్రూట్‌మెంట్ ప్రక్రియ జరుగుతుందని, మధ్యవర్తులను, దళారులను నమ్మి మోసపోవద్దని కల్నల్ వినయ్ కుమార్ యువతను కోరారు.

డిఆర్ఒ ఎం.గణపతిరావు మాట్లాడుతూ, భారత సైన్యంలో యువత భాగస్వామ్యాన్ని మరింత పెంచేందుకు ప్రభుత్వం అగ్నిపథ్ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. నియామక ప్రక్రియకు సంభందించిన పోస్టర్లను విడుదల చేశారు. సమావేశంలో ఆర్మీ అధికారి డా.జి.ఎస్.రణ్ ధావా, డిఆర్ఒ ఎం.గణపతిరావు పాల్గొన్నారు.

సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

సైక్లింగ్‌తో ఆరోగ్యం మెరుగు : కలెక్టర్

ప్రజాశక్తి -కలెక్టరేట్

వాకింగ్, సైక్లింగ్ చేయడంతో ఆరోగ్యం మెరుగుపర్చుకోవాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని సోమవారం స్థానిక ఆర్‌సిఎం స్కూల్ వద్ద జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సైక్లింగ్ మారథాన్ ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఆర్‌సిఎం స్కూల్ నుంచి కలెక్టరేట్ వరకూ ఆరోగ్యంపై అవగాహన ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ఉరుకులు, పరుగుల జీవితంలో ఆరోగ్యం మెరుగుపడేందుకు వ్యాయామానికి కొంత సమయం కేటాయించాలన్నారు. సైక్లింగ్ చేయడం వల్ల శారీక శ్రమతో పాటు శరీరంలోని సక్రమంగా రక్త ప్రసరణ వ్యవస్థ పనిచేయడానికి ఉపకరిస్తుందని అన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బగాది జగన్నాథరావు మాట్లాడుతూ హెల్త్ ఇండియాలో భాగంగా సైక్లింగ్ అనేది ఏరోబిక్ వ్యాయామని శారీరక శ్రమవల్ల హైపర్ టెన్షన్, మధుమేహం, కేన్సర్, గుండె జబ్బులు వంటి దీర్ఘకాలిక జబ్బులకు దూరంగా ఉండవచ్చన్నారు. ఆయుష్మాన్ భారత్ కింద గుర్తింపు కార్డులు కల్పించి ఎన్‌సిడి కేసులను ప్రతి పిహెచ్‌సి పరిధిలోని ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో గుర్తిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ బి.వాగ్దేవి, డిఇఒ ఎస్.డి.వి.రమణ, డిఐఒ టి.జగన్మోహన్‌రావు, ఐసిడిఎస్ ఇన్‌ఛార్జి పిడి కె.విజయలక్ష్మి, వైద్యులు, రెడ్ క్రాస్ చైర్మన్ మంచుపల్లి శ్రీరాములు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సభ్యులు, రెడ్ క్రాస్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు, అంగన్వాడి కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధులకు కారణాలు కనిపెట్టాలి

ప్రజాశక్తి - సీతానగరం

కిడ్నీ వ్యాధి కేసులు నమోదుకు గల కారణాలను ఖచ్చితంగా కనుగొనాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌ను కోరారు. మండలంలోని పెద్దంకలాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని నిడగల్లు మండల పరిషత్ పాఠశాలలో నిర్వహించిన కిడ్నీ స్క్రీనింగ్ మెడికల్ క్యాంప్‌ను సోమవారం సందర్శించారు. విశాఖ పట్నం ఆంధ్రా మెడికల్ కళాశాల నిపుణులైన రాపిడ్ రెస్పాన్స్ బృందం నిర్వహిస్తున్న స్క్రీనింగ్ పరీక్షలను పరిశీలించారు. అక్కడ కొంత మంది కిడ్నీ బాధితులు, కిడ్నీ లక్షణాల అనుమానితులతో మాట్లాడారు. ఆరోగ్యపరంగా ఎదుర్కొంటున్న సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రాంతంలో కిడ్నీ వ్యాధి కేసులు, ప్రభలుటకు గల కారణాలను, అనుమానిత లక్షణాలున్న రోగుల నుంచి స్క్రీనింగ్ పరీక్షలను, నిపుణులైన బృంద సభ్యులతో నిర్వహి ంచి నివేదిక అందజేయాలని జిల్లా వైద్య,ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బగాది జగన్నాథరావును కలెక్టర్ ఆదేశించారు. మెడికల్ క్యాంప్‌కు వచ్చిన వారితో మాట్లాడుతూ కిడ్నీ వ్యాధి అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. ఎవరూ ఆందోళన చెందొద్దని, నివేదిక వచ్చిన అనంతరం తక్షణ చర్యలు చేపడతామని వారిలో ఆత్మవిశ్వా సాన్ని నింపారు. కార్యక్రమంలో రాపిడ్ రెస్పాన్స్ టీమ్ సభ్యులు నెఫ్రాలజీస్ట్ డాక్టర్ రత్న ప్రభ, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ పి.విజయ కుమార్, మైక్రో బయాలజీస్ట్ డాక్టర్ ఎం.మంజుల, సోషల్ ప్రివెంటివ్ మెడిసిన్ డాక్టర్ ఎం.కల్యాణి, ఆర్‌బిఎస్ పిఒ డాక్టర్ ధవళ భాస్కర రావు, ఎస్ఎస్ ప్రసాద్ పట్నాయక్, వైద్య అధికారులు, పిహెచ్‌సి వైద్యులు, ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై మహిళలకు అవగాహన

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ప్రతి మహిళ స్వేచ్ఛ స్వాతంత్ర్యాలతో జీవించేందుకు తమకు రాజ్యాంగం కల్పించిన హక్కులపై అవగాహన ఉండాలని సబ్ జడ్జి జి యజ్ఞ నారాయణ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక బంగారమ్మ కాలనీలో మండల న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా మహిళలు పురుషులకు ధీటుగా అన్ని రంగాల్లోనూ తమ సత్తా చాటుతున్నారని అయితే వారి రక్షణకు రాజ్యాంగం వారికి కల్పించిన హక్కులపై అవగాహన ఉండడం లేదని, అన్నారు. కావున మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని కోరారు. సీనియర్ న్యాయవాది కిమిడి జోగారావు మహిళా చట్టాలపై వివరించారు. కార్యక్రమంలో న్యాయవాది గొర్లి వెంకటరావు కౌన్సిలర్ తాతపూడి వెంకటరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి - పార్వతీపురం

ఈనెల 12న శాసన మండలి పట్టభద్రుల ఎన్నికల సామాగ్రి పంపిణీ కార్యక్రమం ప్రశాంతంగా, సాఫీగా జరగాలని డిఆర్ఒ జల్లేపల్లి వెంకటరావు ఎన్నికల సిబ్బందిని ఆదేశించారు. స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో రిసెప్షన్ సెంటర్, డిస్ట్రిబ్యూషన్ వద్ద ఎన్నికల సామాగ్రి పంపిణీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అనుసరించాల్సిన విధానంపై సోమవారం సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాలెట్ పేపర్లు పంపిణీ, పరిశీలన, బండ్లింగ్ విధానంపై దశలవారీగా వివరించారు. కౌంటర్ల వారీగా ఎన్నికల సామాగ్రి పంపిణీకి ఆదేశించారు. ఎన్నికలకు సంబంధించి నియమించిన ఆయా సిబ్బంది విధులను క్రమశిక్షణతో బాధ్యతగా విధులు నిర్వహించాలని అన్నారు. అనంతరం పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేయనున్న వెబ్ కాస్టింగ్ పక్కగా జరిగేందుకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై శిక్షణ అందించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఎఒ ఉమా మహేశ్వరరావు, ఎన్నికల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పిహెచ్‌సి వద్ద నిరసన తెలుపుతున్న సిహెచ్‌డబ్ల్యులు

సమస్యలు పరిష్కరించాలని సిహెచ్‌డబ్ల్యుల ధర్నా

ప్రజాశక్తి -పాచిపెంట

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండలంలోని గురువునాయుడుపేట పిహెచ్‌సి వద్ద సిఐటియు ఆధ్వర్యాన కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు పని భద్రత లేదని, ఉద్యోగులుగా గుర్తించాలని, ప్రభుత్వం ఆశాలతో సమానంగా వేతనాలు ఇవ్వాలని, యూనిఫాం మంజూరు చేయాలని కోరారు. మెడికల్‌కు సంబంధించిన పరికరాలు అందించి ఆదుకోవాలన్నారు. ప్రధానంగా ఏజెన్సీ హిల్‌టాప్ ప్రాంతాల్లో పనిచేయాలంటే చాలా కష్టమని, ఈ పరిస్థితుల్లో వీరికి టార్చ్ లైట్లు, ఇతర పరికరాలు ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. అలాగే ప్రతి నెలా వేతనం సక్రమంగా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పి.నాగ, ఎం.నందిని, సతాబి, లక్ష్మి, పి.గంగ తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై కొనసాగుతున్న దాడులు

- చట్టాలెన్ని ఉన్నా రక్షణ కరువు
- మహిళా దినోత్సవ సదస్సులో వక్తలు

ప్రజాశక్తి - బలిజిపేట

మహిళల రక్షణకు ప్రభుత్వాలు అనేక చట్టాలు తీసుకొచ్చినా వాటిని పగడ్బందీగా అమలు చేయకపోవడంతో మహిళలపై దాడులు ఇంకా కొనసాగుతున్నాయని పలువురు వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయం వద్ద సిఐటియు, ఐద్వా, రైతు సంఘం ఆధ్వర్యాన మహిళల హక్కులు - సవాళ్లు నిర్బంధాలు అన్న అంశంపై కె.దాలమ్మ అధ్యక్షతన సదస్సు జరిగింది. తొలుత సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మథరావు, శ్రామిక మహిళ సంఘం నాయకులు వి.ఇందిర మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లయినా మహిళలపై దాడులు, హత్యలు, అత్యాచారాలు కొనసాగుతూనే ఉన్నాయన్నారు. సంఘటిత, అసంఘటిత, రంగాల్లోని మహిళలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులు, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు. పోరాటాల ద్వారా సాధించుకున్న మహిళల హక్కులు ఆచరణలో నిర్వీరమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలకు 33శాతం రిజర్వేషన్ నేటికీ కల్పించలేదన్నారు. కావున అంతర్జాతీయ మహిళా దినోత్సవం స్ఫూర్తితో శ్రామిక మహిళలంతా హక్కులు, రక్షణ కోసం, చట్టాల అమలుకు ఐక్య పోరాటాలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శ్రామిక మహిళ నాయకులు వెలగాడ లక్ష్మి, సింహాచలం అమ్మ, సావిత్రి, శ్రీదేవి, లక్ష్మి, మంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న ఐద్వా నాయకులు దాలమ్మ

ఉత్పత్తి సేకరణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఉద్యానశాఖ అధికారి ఎస్ఎన్ రెడ్డి

రూ.3.15 కోట్లతో ఉత్పత్తుల సేకరణ కేంద్రాలు

జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఎస్ఎన్ రెడ్డి

పాచిపెంట : పార్వతీపురం మన్యం జిల్లాలో పలు మండలాల్లో రూ.3.15 కోట్లతో వ్యవసాయ ఉద్యాన ఉత్పత్తుల సేకరణ కేంద్రాలు నిర్మిస్తున్నట్లు ఉద్యాన శాఖ జిల్లా అధికారి ఎస్ఎన్ రెడ్డి తెలిపారు. పాచిపెంటలో రూ.15 లక్షలతో నిర్మిస్తున్న ఉత్పత్తి సేకరణ కేంద్రాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. మార్చి నెలాఖరులోగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మంజూరైన 21 షెడ్లలో ఏడు పూర్తయ్యావని 9 చోట్ల నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. ఈ కేంద్రాలకు అనుసంధానంగా ఉత్పత్తుల శీతలీకరణకు నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఒక్కొక్క ఉత్పత్తుల సేకరణ కేంద్రాలకు సీతలీకరణ ఏర్పాటుకు రూ.12.50లక్షలు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. ఇందులో రైతుల వాటా కింద రూ.3.50లక్షలు చెల్లించాలని మిగిలిన మొత్తాన్ని ప్రభుత్వం చెల్లిస్తుందని అన్నారు. సేకరణ కేంద్రాలతో ఉత్పత్తుల నిల్వ, రవాణాలకు వీలుగా ఉంటుందన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

ఉపాధి పనుల పరిశీలన

పాలకొండ రూరల్ : మండల ంలోని టి.కె.రాజపురం, బెజ్జి పంచాయతీ టిడి పారాపురం, బెజ్జి, లుంబూరు పంచాయతీల్లో ఉపాధిహామీ పథకం ద్వారా జరుగుతున్న చెరువు పనులను ఎంపిడిఒ డొంక త్రినాధులు సోమవారం తనిఖీ చేశారు. ఆయా గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులు ఏ విధంగా చేపడుతున్నారో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేతనదారులు సమయపాలన పాటించి పనులు చేపట్టాలని, నిర్దేశిత కొలతల ప్రకారం పనులు చేపట్టి గిట్టుబాటు కూలీ పొందాలన్నారు.

మహిళా సాధికారతపై అవగాహన

సీతంపేట : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం మహిళా సాధికారతపై అవగాహన కల్పించారు. మార్చి 8 ప్రపంచ మహిళ దినోత్సవ సందర్భంగా ఈ నెల నాలుగో తేదీ నుండి ఆరో తేదీ వరకు డిగ్రీ కళాశాలలో వివిధ కార్యక్రమాలు, క్విజ్ పోటీలు, బృంద చర్చలు వంటి పోటీలు నిర్వహించారు. మహిళలు భాగస్వామ్యం గురించి తెలియజేశారు. మహిళపై జరుగుతున్న దాడులు పై వివరించారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జీవనజ్యోతి, మహిళా పోలీస్ వసంత, నీరజ, బోధకులు శంకరరావు, ప్రభాకర్ రావు, రవి, కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కళింగ వైశ్యసంఘం జిల్లా కోశాధికారిగా రాజేష్

భామిని : కళింగ వైశ్య సంక్షేమ సంఘం జిల్లా కోశాధికారిగా భామినికి చెందిన కోరాడ రాజేష్ ఎన్నికయ్యారు. ఆయనకు సోమవారం మండల కళింగ వైశ్య సంక్షేమ సంఘం సభ్యులు, జిల్లా సభ్యులు ప్రేత్యేక అభినందనలు తెలిపారు. కళింగ వైశ్య కుటుంబీకుల సంక్షేమం, కళింగ వైశ్య సమస్యలు పరిష్కారానికి, ఇచ్చిన బాధ్యతలు సక్రమంగా నిర్వహణకు కృషి చేస్తానని, క్షేత్ర స్థాయిలో కళింగ వైశ్యలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలు పై జిల్లా కళింగ వైశ్య సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్తామని రాజేష్ తెలిపారు.

డంపింగ్ యార్డులో చెలరేగిన మంటలు

పార్వతీపురం టౌన్ : పట్టణ శివారున రాయఘడ రోడ్డులో ఉన్న డంపింగ్ యార్డులో మంటలు పుట్టి భారీగా చెలరేగాయి. దీంతో అంతర్ రాష్ట్రీయ రహదారితో పాటు పరిసర ప్రాంతాలకు దట్టమైన పొగలు వ్యాపించడంతో ఆ ప్రాంతం నుంచి వచ్చే వాహనచోదకులు, పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. స్థానికులు, మున్సిపల్ ప్రజారోగ్య, అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన అగ్నిమాపక వాహనంతో సిబ్బంది వచ్చి మంటలు ఆర్పినప్పటికీ, పొగలు తగ్గకపోవడంతో ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం 8 గంటల వరకు చుట్టుపక్కల ప్రాంతాలతో పాటు ప్రధాన రహదారి, ఫ్లైఓవర్ బ్రిడ్జి మీదుగా పొగకమ్ముకుంది. దీంతో పట్టణ ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు. దీర్ఘకాలంగా ఉన్న డంపింగ్ యార్డ్ తరలింపు సమస్యను పరిష్కరించేందుకు అటు ప్రజా ప్రతినిధులు, ఇటు అధికారులు, చొరవ చూపెడుతున్నప్పటికీ ఒక కొలిక్కి రాకపోవడం గమనార్హం. ఇప్పటికైనా డంపింగ్ యార్డ్ తరలింపుపై దృష్టి పెట్టి సమస్యను పరిష్కరించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

నేటి నుంచి డోలా యాత్ర

కురుపాం : స్థానిక మేజర్ పంచాయతీ కురుపాంలో గల శివన్నపేటలో జగన్నాథ స్వామి ఆలయం వద్ద మంగళ, బుధవారాల్లో రెండు రోజులు పాత్ర డోలో యాత్ర మహోత్సవాలు జరుగుతున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏట హోలీ పండగను పురస్కరించుకొని ఆ రోజు నుంచి రెండు రోజుల పాటు జగన్నాథ స్వామి వారి ఆలయం ఘనంగా పూజలు నిర్వహించి రెండు రాత్రులు కూడా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

వంగర : విద్యార్థినిలు చదువుతోపాటు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఎంఇఒ యాగాటి దుర్గారావు అన్నారు. సఖి కార్యక్రమంలో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9,10 తరగతుల విద్యార్థినిలతో సోమవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చేతులు తరచూ శుభ్రం చేసుకోవాలన్నారు. ఉతికిన బట్టలు ఎండలో బాగా ఆరిన తర్వాతే వాటిని ధరించాలన్నారు. పౌష్టికాహారం తీసుకుని వైద్యులు సూచనల మేరకు ఐరన్ మాత్రలు వేయాలన్నారు. ఇతరులతో మాట్లాడేటప్పుడు వారి ప్రవర్తనను గమనించాలన్నారు. హెచ్ఎం ఎం రవణమ్మ, ఏఎన్ఎం విశాలాక్షి మాట్లాడుతూ రుతుక్రమం వచ్చేటప్పుడు పాటించవలసిన శుభ్రతపై విద్యార్థినిలకు అవగాహన కల్పించారు. అనంతరం సైన్స్ ప్రతిభ పోటీలలో ఇటీవల ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఎంఇఒ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్ జయకృష్ణ, కవిత, శేఖర్, ఆరోగ్య సిబ్బంది మరియమ్మ, సత్యవతి, కుమారి, శశికల పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే నైతిక విలువలు

గరివిడి : విద్యార్థి దశ నుంచే నైతిక విలువలు అలవర్చుకోవాలని ఆశయ సంస్థ అధ్యక్షులు రెడ్డి రమణ అన్నారు. మండలంలోని కాపుశంభాం జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో విద్యార్థులకు పుస్తక పఠనంపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తకాలు చదవడం ఒక సంస్కృతిగా ప్రోత్సహించాలన్నారు. వీడియోలు చూడడం, వీడియో గేమ్‌లు ఆడడం కన్నా పుస్తక పఠనం మనపై ఎక్కువ ప్రభావం చూపుతుందన్నారు. పుస్తకాలు మెదడుకి మంచి ఎక్సరసైజ్ ఇచ్చి ఆలోచనా దృక్పదాన్ని పెంచుతాయన్నారు. విద్యార్థులు యువత సెల్ ఫోన్లలో ఎక్కువ సమయం గడుపుతున్నారన్నారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎన్.పి.ధూళికేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

రేగిడి : మండలంలోని ఉంగరాడమెట్ట డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఈనెల 13న ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లను జిల్లా ఎస్పి దీపిక పాటిల్ సోమవారం పరిశీలించారు. మండలంలో 1,408 ఓట్లు ఉన్నాయని అధికారులు ఎస్పికి తెలిపారు. 26,27 పోలింగ్ కేంద్రాలలో మౌలిక సౌకర్యాలతో పాటు బందోబస్తు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధిస్తున్నట్లు తెలిపారు.

కాంగ్రెస్ నిరసన

నెల్లిమర్ల : బిజెపి ప్రభుత్వం చేపడుతున్న ఎల్ఐసి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇతర జాతీయ బ్యాంకుల బలవంతపు పెట్టుబడులపై కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకిస్తూ సోమవారం స్థానిక ఎస్‌బిఐ వద్ద కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో నెల్లిమర్ల కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు కనకాల పద్మనాభం, ఎస్ సూరిబాబు, నరసింహులు, రామకృష్ణ, అప్పారావు, జగదీష్, రమణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

కైలాసనాథ ఉత్సవాల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

గుమ్మలక్ష్మీపురం : ఈనెల 17 నుండి ఐదు రోజులపాటు నిర్వహిస్తున్న కైలాసనాథ యాత్ర మహోత్సవాలకు సంబంధించిన గోడపత్రికలను సర్పంచ్ బి గౌరీ శంకర్రావు సోమవారం రాత్రి ఆవిష్కరించారు. ఉత్సవాలకు ప్రజల సహకారం పూర్తిస్థాయిలో అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు కొత్తకోట విష్ణు ప్రసాద్, గ్రామ ఉపసర్పంచ్ కిషోర్, దోస్త్ మేరా దోస్త్ అధ్యక్షులు ప్రేమానంద్, సంఘం అధ్యక్షులు హరిప్రసాద్, కమిటీ ఉపాధ్యక్షులు పైడా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అభివృద్ధికి ఆమడదూరాన సర్కారు బడులు

- మౌలిక సౌకర్యాల్లేక విద్యార్థులకు అవస్థలు
- నాడు-నేడు నిధుల కోసం ఎదురుచూపులు

ప్రజాశక్తి - బలిజిపేట

విద్యా రంగానికి పెద్దపీట వేస్తున్నామని, నాడు-నేడు నిధులతో కార్పొరేట్ పాఠశాలలను తలదన్నేలా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చుతున్నామని పాలకులు ప్రసంగాలకు, ఆచరణకు పొంత ఎక్కడా కానరావడంలేదు. ఒకవైపున పిల్లల ఉన్న పాఠశాలల మూసేసి.. ఆ పాఠశాలలకే నాడు-నేడు నిధులు మంజూరు చేసుకొని తూతూ మంత్రంగా పనులు చేసి జేబులు నింపుకుంటున్న వైనాలు అనేకం. ప్రస్తుతం విద్యార్థులు ఎక్కువ పాఠశాలలకు నాడు-నేడు నిధులు మంజూరు చేసి పనులు మాత్రం ముందుకు సాగని పరిస్థితి నెలకొంది. దీంతో అటు విద్యార్థులు, ఇటు ఉపాధ్యాయులు అనేక అవస్థలుపడుతున్నారు. ఇందుకు ఉదాహరణ మండలంలోని నారాయణపురం జిల్లా ఉన్నత పాఠశాల దుస్థితి.

మండలంలోని నారాయణపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మౌలిక సదుపాయాలేక విద్యార్థులు, ఉపాధ్యాయుల అవస్థలు వర్ణణాతీతం. ఈ పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు 137మంది, మూడు నుంచి ఐదో తరగతి వరకు 56మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఈ పాఠశాలకు నాడు-నేడు నిధులు మంజూరైనా పనులు సక్రమంగా జరగడంలేదు. దీంతో జిల్లా పరిషత్ పాఠశాలలో తరగతి గదులు చాలకపోవడంతో 3 నుంచి 5వ తరగతి వరకు విద్యార్థులను ఎంపిపి పాఠశాలకు పంపిస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఏడాదికి పాఠశాల అభివృద్ధి నిధులు సుమారు రూ.25 వేలు వస్తాయని సంగతి అందరికీ తెలిసిందే. ఆ నిధులతో చేపట్టాల్సిన పనులు కూడా సక్రమంగా చేపట్టని పరిస్థితి నెలకొంది. ప్రహరీ గోడ గేటు లేకపోవడంతో మందుబాబులు, ఆకతాయి పాఠశాలను అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మార్చుకుంటున్నారు. అలాగే పాఠశాలలో మంచినీటి సదుపాయం లేక విద్యార్థులు ఇంటి నుంచే బాటిళ్లతో మంచినీళ్ల తెచ్చుకుంటున్నారు. బాత్‌రూంలకు నీటి సౌకర్యం లేక బాలికలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాల ముందు చెత్తాచెదారం ఉండడంతో పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. వీటి వల్ల విద్యార్థులు వ్యాధుల బారిన పడుతున్నారు. పాఠశాలలో కనీస సౌకర్యాల కల్పనలో పాలకులు విఫలమయ్యారని విద్యార్థుల తల్లిదండ్రులు విమర్శిస్తున్నారు. పాఠశాల అభివృద్ధికి వస్తున్న నిధులు ఏమవుతున్నాయో అర్థం కావడం లేదని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఎంఇఒ, పాఠశాల కమిటీ చైర్మన్, ఇతర సభ్యుల పర్యవేక్షణ లేకపోవడం కూడా ఒక కారణమని విమర్శిస్తున్నారు. ఈ పాఠశాల పూర్వ విద్యార్థులు తమ వంతు సహకారంగా రూ.10వేలు స్కూల్‌లో తాగునీటికి విరాళం ఇచ్చేందుకు ముందుకొచ్చారు. ఇప్పటికైనా అధికారులు, పాఠశాల కమిటీ సభ్యులు స్పందించి పాఠశాలల మౌలిక సదుపాయాలు కల్పించి, విద్యార్థులకు మెరుగైన విద్యను అందేలా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రహరీ లేని నారాయణపురం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల

'రాజుల పాలన వద్దు.. గిరిజన పాలనే ముద్దు'

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

75 ఏళ్ల రాజకీయ చరిత్రలో కురుపాం నియోజకవర్గంలో చినమేరంగి రాజుల పాలనతో గిరిజనాభివృద్ధి పూర్తిగా కుంటిపడిందని గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, టిడిపి సీనియర్ నాయకులు దత్తి లక్ష్మణరావు అన్నారు. మండలంలోని ఇరిడిలో రాష్ట్రానికి ఇదేం కర్మ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పురవీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గిరిజన సంక్షేమం, అభివృద్ధి కోసం వస్తున్న కోట్లాది రూపాయలు పక్కదారి పడుతున్నాయని ఆరోపించారు. గత ప్రభుత్వాల హయాంలో 90 శాతం సబ్సిడీపై స్ప్రేయింగ్ మిషన్లు, విత్తనాలు, ఎరువులు, కార్లు, ట్రాక్టర్లు వంటివి ఐటిడిఎ ద్వారా గిరిజనులకు అందిస్తే వైసిపి మూడున్నరేళ్ల పాలనలో ఎప్పుడైనా ఇచ్చారా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా గిరిజనులు మేల్కొని కలసికట్టుగా పనిచేసి రానున్న రానున్న ఎన్నికల్లో స్వచ్ఛమైన గిరిజన అభ్యర్థిని ఎమ్మెల్యేగా గెలిపించి, రాజుల పాలనకు ముగింపు పలకాలని పిలుపునిచ్చారు. టిడిపి సీనియర్ నాయకులు, బిడ్డిక పద్మావతి మాట్లాడుతూ వైసిపి పాలనలో గిరిజనులకు కష్టాలు తప్పడం లేదన్నారు. ఈ ప్రాంతంలో సాగునీటి వనరులు అభివృద్ధి జరగలేదన్నారు. రోజురోజుకు పెరుగుతున్న గ్యాస్, పెట్రోల్, నిత్యవసరాల ధరలతో గిరిజనులకు ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదన్నారు. టిడిపి నాయకులు కొండలరావు మాట్లాడుతూ ఇరిడిలోనిపాఠశాలకు, అంగన్వాడీ కేంద్రానికి నేటికీ పక్కా భవనం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఆశావాహులు బిడ్డిక తమ్మయ్య, పువ్వల లావణ్య, ఆర్ఎస్ఎస్ విజయ్ కుమార్, భూపతిదొర, నాయకులు మీసాల శశిభూషణరావు, ఎం. వెంకట నాయుడు, రమణమూర్తి, లక్ష్మణరావు, నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ర్యాలీ చేస్తున్న టిడిపి నాయకులు

నేల ఆరోగ్యానికి నవధాన్యాల సాగు

ప్రజాశక్తి - పాచిపెంట

నేల ఆరోగ్యానికి నవధాన్యాలు సాగు ఎంత అవసరమో మానవుల ఆరోగ్యానికి చిరుధాన్యాలు అంతే అవసరమని మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. మండలంలోని పాంచాలిలో నిర్వహించిన రైతుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏకపంట విధానంతో నిస్సారమవుతున్న భూములను సారవంతం చేయాలంటే నవధాన్యాలు సాగు చేసి కలియ దున్నడం ఒక్కటే మార్గమన్నారు. నవధాన్యాలు సాగు చేస్తే రసాయన ఎరువులపై ఆధారపడడం పూర్తిగా తగ్గుతుందని తెలిపారు. మానవుల ఆరోగ్యానికి చిరుధాన్యాల సాగు ఎంతో అవసరమన్నారు. చిరుధాన్యాలకు సరైన మద్దతు ధరను నిర్ణయించి పండించిన చిరుధాన్యాలను పూర్తిగా కొనుగోలు చేస్తుందని దీనివల్ల రైతులకు ఖర్చు తగ్గి అధిక ఆదాయం రావడమే కాకుండా నీటి వినియోగం కూడా తగ్గుతుందన్నారు. ఎకరా వరి పంటకు కావాల్సిన నీటితో మూడు ఎకరాల చిరుధాన్యాలను పండించవచ్చని అంతేకాకుండా చిరుధాన్యాల కాలవ్యవధి తక్కువగా ఉండడం వల్ల ఏడాదిలో మూడు పంటలు పండించే పంటల సరళికి అనువైందని తెలిపారు. చిరుధాన్యాలు అత్యంత పోషక విలువలతో పాటు రోగ నిరోధక శక్తి పెరిగి మనుషులు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. అనంతరం ప్రకృతి సేద్య ప్రతినిధులు యశోదమ్మ, బాలకృష్ణ ఐసిఆర్‌పి రమణ, విఎఎ శ్రీను ఆధ్వర్యంలో నవధాన్యాలు చిరుధాన్యాల ఆవశ్యకతను తెలియజేస్తూ ర్యాలీ నిర్వహించారు.

ర్యాలీ చేస్తున్న అధికారులు, రైతులు

స్పందనకు 28 వినతులు

ప్రజాశక్తి- సీతంపేట

ఐటిడిఎ స్పందనకు సోమవారం 28 వినతలు వచ్చాయి. ఈ స్పందన కార్యక్రమం పిఒ బి.నవ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. మాలువ గ్రామానికి చెందిన రవికుమార్ ఇంటర్నెట్ జిరాక్స్ షాపు పెట్టడానికి ఆర్థిక సహాయం మంజూరు చేయాలని విన్నవించారు. మానాపురం గ్రామానికి చెందిన సోమన్న విద్యుత్ స్తంభాల మంజూరు చేయాలని, సిసి రోడ్లు, వీధి లైట్లు మంజూరు చేయాలని, బూర్జి గూడ గ్రామానికి చెందిన మార్త కుట్టుమిషన్ మంజూరు చేయాలని, ముకుంద పురం గ్రామానికి చెందిన కుండంగి పోట్టేసు ఐటిడిఎ పరిధిలో డిసిసి ద్వారా చేసిన రోడ్డు పనులు సంబంధించి పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని, పాండ్ర గ్రామానికి చెందిన సేమియా గ్రావిటేషన్ ఫ్లో పథకం మంజూరు చేయాలని, పులిగుమ్మికి చెందిన చిలకమ్మా జీడి పిక్కల వ్యాపారం కొరకు ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ఈ స్పందన కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి మురళి, సిడిపిఒ రంగలక్ష్మి, ఏటిడబ్ల్యూఒ మంగ వేణి, ఒఎస్‌డి యుగంధర్, ఎఎంఒ కోటి బాబు తదితరులు పాల్గొన్నారు.

వినతులు స్వీకరిస్తున్న పిఒ నవ్య

ఆలయాల అభివృద్ధికి పెద్దపీట

ప్రజాశక్తి - వీరఘట్టం

మన్యం జిల్లాలో 100 దేవాలయాల అభివృద్ధికి టిటిడి గ్రీన్ సిగ్నల్ ఇవ్వగా వీటిలో 98 దేవాలయాలు పాలకొండ నియోజకవర్గంలోనివి కేటాయించడం విశేషమని ఎమ్మెల్యే కళావతి అన్నారు. మడలంలోని వండవలోని సోమవారం తన క్యాంపు కార్యాలయంలో ఆమె విలేకర్లతో మాట్లాడారు. ఒక్కొక్క దేవాలయానికి రూ. 10 లక్షలు చొప్పున రూ. 10 కోట్లు నిధులు తిరుమల తిరుపతి దేవస్థానం విడుదల చేసినట్లు తెలిపారు. వచ్చే నెల నుండి దేవాలయ నిర్మాణాలకు శ్రీకారం చూడతమని చెప్పారు. జిల్లాలోనే ఒక్క పాలకొండ నియోజకవర్గానికి ఇంత పెద్ద సంఖ్యలో దేవాలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయడం వెనుక ఎమ్మెల్యే కళావతి కృషి ఎంతో ఉందని జిల్లా దేవదాయ శాఖ కమిషనర్ కెఎల్ సుధారాణి తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సర్పంచ్ కళ్యాణి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఎస్‌వి రమణ, తదితరులు పాల్గొన్నారు.

ఎపిటిఎఫ్ నిరసన

పాలకొండ రూరల్: సమస్యల పరిష్కారం కోసం ఎపిటిఎఫ్ ఆధ్వర్యంలో పాతతాలూకా కేంద్రమైన తహశీల్దార్ కార్యాలయం ముందు ఎపిటిఎఫ్ నాయకులు సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మండలశాఖ అధ్యక్ష, కార్యదర్శులు వాసుదేవరావు, సంపత్‌కుమార్ మాట్లాడుతూ దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న డిఎలను, 12వ పిఆర్‌సిని వెంటనే కమిషన్ వేయాలని డిమాండ్ చేశారు. 3,4,5 తరగతుల విలీనాన్ని రద్దు చేయాలన్నారు. సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ సోమేశ్వరరావు అందించారు. కార్యక్రమంలో ఎపిటిఎఫ్ జిల్లా పూర్వపు అధ్యక్షులు అచ్చుతరావు, ఉపాధ్యక్షులు బి.వి.రమణ, కార్యదర్శి ఉమామహేశ్వరరావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గోగుల సూర్యనారాయణ, శ్రీరాములునాయుడు తదితరులున్నారు.

వీరఘట్టం: ఉపాధ్యాయులకు పనిభారం తగ్గించాలని సోమవారం సాయంత్రం ఎస్‌సి, ఎస్‌టి టీచర్స్ ఫెడరేషన్ దళిత పరిరక్షణ సమితి పే బ్యాక్ సొసైటీ నాయకులు సిహెచ్ సత్యనారాయణ కోరారు. ఉపాధ్యాయులపై పనిభారం ఒత్తిడి పెరిగి ఉపాధ్యాయులు మానసిక ఆందోళనకు గురవుతున్నారని చెప్పారు. అనంతరం ఎస్‌సి, ఎస్‌టి టీచర్స్ ఫెడరేషన్ దళిత పరిరక్షణ సమితి పే బ్యాక్ సొసైటీ క్యాలెండర్, డైరీలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శులు ఎ.సూర్యనారాయణ, ఎ.ప్రసాద్ రావుతో పాటు సంఘ గౌరవ అధ్యక్షులు శ్రీబాబు,తదితరులు పాల్గొన్నారు.

లోవరకండిలో చేతిపంపులకు మరమ్మతులు

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని దేవరసిర్లాం పంచాయతీ పలోవరకండిలో మంగళవారం చేతిపంపులకు మరమ్మతులు చేపట్టి తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నట్లు ఎంపిడిఒ దేవకుమార్ తెలిపారు. సోమవారం లోవర్ కండి.. గొంతు ఎండ్తోంది.. అన్న శీర్షికన ప్రజాశక్తిలో వెలువడిన కథనానికి ఎంపిడిఒ స్పందించి పాడైన బోరుబావులకు మరమ్మతులు చేపట్టారు. రక్షిత మంచినీటి పథకానికి విధులు లేనందున మరమ్మతులు చేయలేమని తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో రక్షిత పథకానికి మరమ్మతు చేసేందుకు ప్రణాలకు సిద్ధం చేశామన్నారు

ప్రజాశక్తి కథనానికి స్పందన

రూ.8.75 లక్షలతో క్రాస్ ప్రోగ్రాం

మండలంలోని రూ.8.75లక్షలు నిధులతో క్రాస్ ప్రోగ్రాం కోసం పరికరాలు తెచ్చామని ఎంపిడిఒ తెలిపారు. ఈనెల 20నుంచి గ్రామాల్లో మరమ్మతులకు గురైన బోరు బావులను బాగు చేసే కార్యక్రమం చేపడతామన్నారు. మండలంలో 429 బోరుబావులు ఉన్నాయన్నారు. రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకొని తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో ఆర్డబ్ల్యుఎస్ జెఇ జోగారావు నాయుడు పాల్గొన్నారు.

టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

పార్వతీపురంరూరల్ : పదో తరగతి పరీక్షల్లో గిరిజన సంక్షేమ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని డిఇఒ డివి రమణ అన్నారు. సోమవారం మండలంలోని డోకిశిల గిరిజన సంక్షేమ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన పదో తరగతి విద్యార్థులకు పరీక్షలకు జరుగుతున్న సన్నద్ధతను పరిశీలించారు. విద్యార్థులకు గణితంలో మెలుకువలు బోధించారు. అనంతరం విద్యార్థుల కోసం తయారవుతున్న భోజనాలను పరిశీలించారు. వంటల్లో పరిశుభ్రత తప్పక పాటించాలని, ప్రధానోపాధ్యాయులు ముందుగా తప్పనిసరిగా రుచి చూడాలని సూచించారు. వసతిగృహం విద్యార్థుల ఆరోగ్యం పట్ల సంరక్షకులు ప్రత్యేక పరిశీలన జరపాలన్నారు. అనంతరం పాఠశాలకు చెందిన దస్త్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గోవిందరావు, వార్డెన్ రమేష్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనాలను పరిశీలిస్తున్న డిఇఒ

పిడిఎఫ్ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.రమాప్రభకు మద్దతుగా మండల కేంద్రంలో సోమవారం ప్రజా సంఘాల నాయకులు ప్రచారం నిర్వహించారం నిర్వహించారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి, గిరిజన హక్కుల పోరాటానికి, సాగునీటి వనరుల అభివద్ధికి, ఉద్యోగులు సమస్యల కోసం, పేదల అభ్యున్నతికి పాటుపడే పిడిఎఫ్ అభ్యర్థి కె.రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు కె.గంగునాయుడు, సీతారాం తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ : పిడిఎఫ్ అభ్యర్థి కె రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటేసి గెలిపించాలంటూ సిఐటియు నాయకులు వి.ఇందిర, కె.సాంబమూర్తి పిలుపునిచ్చారు. ఈ మేరకు మండల కేంద్రంలో ప్రజాసంఘాల ఆధ్వర్యాన ప్రచార ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు ఎ.ఉపేంద్ర, గంగరాజు, బోడయ్య, నాగరాజు, వెంకట్రావు సన్యాసిరావు, శ్రీధర్, రాజు, బోడయ్య పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్ : ప్రజల హక్కుల కోసం పిడిఎఫ్ ఎమ్మెల్సీలు ఎనలేని పోరాటాలు సాగిస్తున్నారని సిఐటియు, డివైఎఫ్ఐ నాయకులు అన్నారు. మండలంలోని కృష్ణపల్లి, పెదమరికి, ఎల్ఎన్‌పురంలో ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని కోరుతూ విస్తృతం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర పట్టభద్రులు విజ్ఞత ప్రదర్శించి, పిడిఎఫ్‌ని గెలిపించి, శాసనమండలిలో ప్రజావాణిని వినిపించేందుకు మద్దతు పలకాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రెడ్డి వేణు, కె.రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

సాలూరు : వామపక్షాలతో పాటు 250 ప్రజా సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభని గెలిపించాలని ఎఐటియుసి సీనియర్ నాయకులు సిద్దాబత్తుల రామచంద్ర రావు కోరారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వైనాయుడు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు డి.పండుతో కలిసి ప్రచార కరపత్రాలను విడుదల చేశారు. ప్రభుత్వ ఉద్యోగుల, పెన్షనర్ల, నిరుద్యోగ యువకుల సమస్యల్ని పరిష్కరించాలని కోరుతూ కౌన్సిల్‌లో గొంతు వినిపించాలంటే పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభని గెలిపించాలని ఆయన కోరారు.

భామిని: మండలంలోని బత్తిలి, కాట్రగాఢ-బి, భామిని, నల్లారాయిగూడ, ఘనసరాలో పట్టభద్రుల ఇంటింటికి వెళ్లి కరపత్రాలతో ప్రచారం నిర్వహించారు. అనంతరం భామిని కూడలి ఎంఎల్‌సి రమాప్రభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ దండు ప్రకాశరావు, సిఐటియూ కార్యదర్శి ఎం. అప్పలస్వామి, సిపిఎం కన్వీనర్ జగన్నయకులు, కార్యదర్శి కె. మిన్నరావు, గిరిజన సంఘం అధ్యక్షులు కొండగొర్రి భాస్కర్ రావు, రవి మహాపాత్రో తదితరులు పాల్గొన్నారు.

సాలూరు : వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

వీరఘట్టంలో మెగా నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రంలోని సత్యసాయి మందిర ఆవరణలో నవజీవన్ తిరుపతి ఫౌండర్ అధ్యక్షులు డాక్టర్ కెఎస్ ఆచార్య సహకారంతో చీఫ్ మేనేజర్ ఎస్‌వి రమణ ఆధ్వర్యంలో సోమవారం మెగా నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. విశాఖకు చెందిన శంకర్ ఫౌండేషన్ అప్తాలమిక్ అధికారి జాన్సన్ 180 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో భాగంగా 90 మందిని శస్త్ర చికిత్సల కోసం ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో క్యాంపు కోఆర్డినేటర్ సిహెచ్ వెంకటరమణ, తేజస్వరూప, స్టాఫ్ నర్స్ గంగ, ఝాన్సీ, సత్య సాయి కన్వీనర్ వి విశ్వప్రసాద్, జి.మురళీకృష్ణ, జి. గణపతిరావు, ఎం. వరహ నరసింహులు, ఏ.కృష్ణబాబు, టి. నరేష్ తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం: కళ్ల ఆపరేషన్లకు ఎంపికైన వృద్ధులు

నేడు ఉచిత నేత్ర వైద్య శిబిరం

భామిని : శ్రీకాకుళం జిల్లా అంధత్వనివారణ సంస్థ సహకారంతో, పుష్పగిరి కంటి ఆసుపత్రి విజయనగర ఆధ్వర్యంలో, హోలి క్రాస్ స్వచ్ఛంద సంస్థ నిర్వహణలో భామిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్లు హోలీ క్రాస్ సిఇఒ కరణం ప్రభుదాస్ తెలిపారు. ఈ శిబిరంలో ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహిస్తామని, అంతర కుసుమలు గల రోగులకు అతి ఖరీదైన ఐఒఎల్ ఆపరేషన్ ఉచితంగా చేస్తామని చెప్పారు. ఆపరేషన్ కోసం హాస్పిటల్ రవాణా, వసతి, భోజనం సమకూరుస్తామన్నారు. ఈ వైద్య శిబిరానికి వచ్చే వారు ఆరోగ్య శ్రీ కార్డు, ఆధార్ కార్డు తీసుకురావాలని సూచించారు. ఈ శిబిరంలో పారామెడికల్ అప్తమాలిక్ అధికారి ఇప్పిలి జానకి, రామయ్య, భామిని పిహెచ్‌సి వైద్యులు ఎన్.ఫణికుమార్, పి.సోయల్, సిహెచ్ఒ జి. భాస్కరరావు పాల్గొంటారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని హోలీ క్రాస్ సిఇఒ తెలిపారు.

పాలకొండ : స్థానిక పెదకాపువీధి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం నేత్ర వైద్యాధికారి పి.కృష్ణారావు వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు తనిఖీలు చేపట్టారు. 99 మందికి తనిఖీలు చేశారు. అందులో అవసరమైన వారికి కళ్లద్దాలు అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం జామి రవి తదితరులున్నారు.

పార్వతీపురంరూరల్: ఈనెల 9న గురువారం పార్వతీపురం అగ్నిమాపక కేంద్రంలో ప్రత్యేక రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు స్థానిక అగ్నిమాపక కేంద్రం అధికారి యు.సుధాకర్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ నిషాంత్‌కుమార్ చేతులు మీదుగా ప్రారంభమయ్యే శిబిరంలో పాల్గొని రక్తదానం చేసి కార్యక్రమం విజయవంతం చేయాలని దాతలకు పిలుపునిచ్చారు

నేరాలు ఘోరాలు

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

సాలూరురూరల్ : కారులో మద్యం తరలిస్తున్న వ్యక్తిని రూరల్ పోలీసులు పట్టుకున్నారు. రూరల్ ఎస్ఐ ప్రయోగమూర్తి తెలిసిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని దేవుబుచ్చెంపేటకు చెందిన కె.తిరుపతిరావు కారులో సుమారు 50 మద్యం బాటిళ్లు తరలిస్తుండగా చంద్రంపేట వద్ద సోమవారం పట్టుకున్నామన్నారు. పట్టుబడిన మద్యం బాటిళ్లను, వాటిని తరలిస్తున్న, కారును సీజ్ చేసి శ్రీనివాసరావును అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ముగ్గురికి గాయాలు

పార్వతీపురంరూరల్ : గుర్తు తెలియని వాహనం ఢీకొని ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. గుమ్మలక్ష్మీపురం మండలం తోట గ్రామానికి చెందిన మండంగి చంటి, నిమ్మక జోగేష్, బిడ్డిక గోపాల్ అనే ముగ్గురు గిరిజన యువకులు తమ గ్రామానికి సమీపంలోని ఒడిషా సరిహద్దు గ్రామం గుణుపురంలో ఆదివారం జరిగిన జాతర చూసి ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తున్నారు. కేదారపురం సమీపంలో వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం అర్ధరాత్రి ఢీకొనడంతో పక్కనున్న పొదల్లోకి దూసుకుపోయారు. ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను గుర్తించిన కొందరు 108 వాహనంలో జిల్లా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం వైద్యులు, విశాఖకు తరలించారు. ఔట్‌పోస్టు పోలీసులు వివరాలు నమోదు చేశారు.

IN THE HONOURABLE COURT OF JUNIOR CIVIL JUDGE, PALAKONDA.
IA. 156/2020 IN O.S. 66/2019.

Between : **Andhra Bank,** Palakonda rep, by its Branch Manager **--Petitioner/Plaitiff**
And:- **Mamidi Appala Swamy**(died) and others **--Respondents/Defendants**
(Proposed LRS of deceased Dependant)

To, **Proposed Legal:**
R4. మామిడి రవి, S/o లేటు రామయ్య, వడమ గ్రామం, పాలకొండ మండలం, పార్వతీపురం – మన్యం జిల్లా.
R5. మామిడి కాంత, S/o లేటు రామయ్య,
-Rest-do-

పై నెంబరు దావాను వాది తమ బ్యాంకుకు ప్రతివాది **మామిడి అప్పలస్వామి** చేసిన రుణ వసూలు నిమిత్తం వేసి యున్నారు. ప్రతివాది మామిడి అప్పలస్వామి చనిపోయినందున మిమ్మలను వారసులుగా పై దావాలో ప్రతివాదులుగా చేర్చుమని కోరుతు **I.A. 156/2020** పిటిషను వేసి యున్నారు. సదరు పిటిషనులో మీకు నోటిసు నిమిత్తం **తేది గం॥ 10.03.2023** న వాయిదా అయి ఉన్నది. కావున ఆ దినము అనగా **తే 10.03.2023 ది ఉ॥ 10.30 గ॥ లకు** మీరు స్వయముగా గాని లేక మీ న్యాయవాది ద్వారా గాని పై కోర్టులో హాజరు కావలెను. లేని ఎడల మీ పరోక్షమున కేసును విచారించి తీర్మానించడం అగునని ఈ నోటిసు ద్వారా మీకు తెలియజేస్తున్నాము.

గుడ్ల శంకర రావు
న్యాయవాది,
శ్రీకాకుళం.